క్లుప్తంగా

జనార్ధన స్వామికి విశేష పూజలు


పరశురామావతారంలో జనార్ధన స్వామి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్థానిక అగ్రహారంలోని శ్రీ భూ, నీళా సమేత శ్రీ జనార్ధన స్వామి దేవస్థానంలో గురువారం స్వామి వారికి విశేష పూజలు చేశారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, తిరుప్పావై సేవా కాలం నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో అష్టోత్తర పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి వారికి పరశురామావతార అలంకరణ చేశారు. రాత్రి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు వంగల పవన్ కుమార్ విశేష పూజలు చేయగా కార్య నిర్వహణాధికారి గుబ్బల రామ పెద్దింట్లరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

అరెస్ట్‌కు ముందు ఉచిత న్యాయ సాయం


సదస్సులో మాట్లాడుతున్న రత్నప్రసాద్

ఏలూరు రూరల్: నేరం మోపబడిన వ్యక్తి అరెస్ట్ అయ్యే ముందు న్యాయసేవాధికార సంస్థ నుంచి ఉచిత న్యాయ సాయం పొందవచ్చని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అన్నారు. జిల్లా న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ ఆధ్వర్యంలో గురువారం ఏలూరు రూరల్ మండలం చాటపర్రులో న్యాయసేవాధికార సంస్థ అవగాహన సదస్సు నిర్వహించింది. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలు, కర్మాగారాలు, విద్యా తదితర సంస్థల్లో లింగ వివక్షత చూపించిన వారిని చట్టం కఠినంగా శిక్షిస్తుందని చెప్పారు. చట్టం దృష్టిలో అందరూ సమానమేన్నారు. వివక్షతకు గురైన వ్యక్తులు ఎవరైన న్యాయ సాయం పొందవచ్చన్నారు. మరో అధికారిణి సూర్యచక్రవేణి మాట్లాడుతూ చిన్నపిల్లలకు బాల్య వివాహం, వెట్టిచాకిరి, భిక్షాటన చేయించడం నేరం అన్నారు. అలాంటి వారిపై చట్టం దృష్టిలో శిక్షార్హులవుతారని చెప్పారు. అనంతరం న్యాయాధికారులు స్థానిక జెడ్పీ పాఠశాల సందర్శించి, మధ్యాహ్న భోజనం, మౌలిక వసతులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి ఉపాధ్యాయులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ ప్రణవి, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ‘ఆడుదాం ఆంధ్ర’


మల్కాపురంలో ఖోఖో ఆడేందుకు వచ్చిన మహిళా జట్లు


మాదేపల్లిలో ఖోఖోలో పాల్గొన్న మహిళలు


పైడిచింతపాడులో వాలీబాల్ ఆడుతున్న యువకులు


వెంకటాపురంలో బ్యాడ్మింటన్ ఆడుతున్న యువతులు

ఏలూరు రూరల్: ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు యువతీ యువకుల్లో ఉత్సాహం నింపుతున్నాయి. గురువారం మూడో రోజు ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు ఏలూరు రూరల్ గ్రామాలైన జాలిపూడి, వెంకటాపురం, మాదేపల్లి, మల్కాపురం, పైడిచింతపాడులో నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ఆడుదాం ఆంధ్ర పోటీలు గ్రామీణ ప్రజల్లో ఉత్తేజం, ఆసక్తిని పెంచాయని ఈఓపీఆర్డీ ఎం సరళకుమారి అన్నారు. గ్రామాల్లో ఆటల పోటీలను ఆమె పర్యవేక్షించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందించారు. అనంతరం ఆయా ప్రాంతాల్లోని సచివాలయాల కార్యదర్శులు మహిళలను జట్లుగా విభజించి పోటీలు నిర్వహించారు. వెంకటాపురంలో వీఆర్వో రత్నరాజు పర్యవేక్షణలో బ్యాడ్మింటన్, జాలిపూడిలో ఇన్‌చార్జి కార్యదర్శి రవీంద్ర పర్యవేక్షణలో సచివాలయ ఉద్యోగులకు పోటీలు, పైడిచింతాపాడులో యువకులకు వాలీబాల్‌పోటీలు నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని పలు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించడానికి, వార్షిక లైన్ల మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జేపీబీ నటరాజన్ తెలిపారు. రామకృష్ణాపురం, పోస్టల్ కాలనీ, విజయ గార్డెన్స్, నెహ్రూ కాలనీ, గులాబీ తోట పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, అగ్రహారం, బావిశెట్టివారి పేట, నవాబు పేట, నల్లదిబ్బ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

తంగెళ్లమూడి సెక్షన్ పరిధిలో..

ఏలూరు రూరల్: తంగెళ్లమూడి సెక్షన్ పరిధిలో గవరపేట, ఆళ్ల నాని కాలనీ, అరుంధతికాలనీ, ఎంఆర్‌సీకాలనీ, మావయ్యగారితోట పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఆపరేషన్ సెక్షన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నటరాజన్ తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తామని వెల్లడించారు.

పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయం


కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న మేయర్ నూర్జహాన్

ఏలూరు టౌన్: స్థానిక నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయమని ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ అన్నారు. ఏలూరు కార్పొరేషన్ పర్మినెంట్ పబ్లిక్ హెల్త్ విభాగ కార్మికులు, క్లాస్–4 ఉద్యోగులకు ఏలూరు మేయర్ చాంబర్‌లో గురువారం మేయర్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు చేతులమీదుగా యూనిఫామ్ పంపిణీ చేశారు. పబ్లిక్ హెల్త్, క్లాస్–4 ఉద్యోగులు 286 మంది కార్మికులకు ఏటా మాదిరిగానే యునిఫామ్ అందజేశారు. మహిళా కార్మికులకు మూడు చీరలు, 3 జాకెట్లు, మగవారికి రెండు జతల దుస్తులు, రెండు జతల చెప్పులు, మూడు టవల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ పారిశుధ్య కార్మికులు తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి విశేష సేవలు అందించారని కొనియాడారు. కార్మికులకు నగరపాలక సంస్థ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్పొరేటర్లు జిజ్జువరపు విజయనిర్మల, సబ్బన శ్రీనివాసరావు, కలవకొల్లు సాంబ, బత్తిన విజయకుమార్, కోఆప్షన్ సభ్యులు నీతాజైన్, హెల్త్ ఆఫీసర్ మాలతి, సెక్రటరీ ప్రభుదాస్, పార్టీ నాయకులు జిజ్జువరపు రమేష్ తదితరులు ఉన్నారు.

కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక యూనియన్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకుల కోసం ఉచిత కంప్యూటర్ శిక్షణ అందించనున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ కె.శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ ట్యాలీ, ఎమ్మెస్ ఆఫీస్ అంశాల్లో 30 రోజుల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. 10వ తరగతి ఆ పై విద్యార్హత గల 19 నుంచి 45 సంవత్సరాల్లోపు వయసు గల గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు మాత్రమే ఈ అవకాశం ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు తమ పేర్లను ఫోన్ నెంబర్లు 99485 65256, 95027 23561లో నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం నేరుగా సంస్థకు వచ్చి ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, మూడు కలర్ పాస్‌పోర్ట్ ఫొటోలు సమర్పించి, ప్రవేశాలు పొందాలని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

శ్రీవారి సప్తాహాలు ప్రారంభం

అలరించిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు


విశేష అలంకరణలో వేంకటేశ్వర స్వామి


ఉత్సవాల ప్రారంభం సందర్భంగా గోపూజ చేస్తున్న ట్రస్ట్‌బోర్డ్ చైర్మన్ తోలేటి శ్రీనివాస్ దంపతులు


ధ్వజారోహణలో పాల్గొన్న నగర మేయర్ షేక్ నూర్జహాన్, పెదబాబు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో మూడువారాల త్రిసప్తాహ బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వివిధ ధ్వజాలను నగర ప్రముఖులు ఆవిష్కరించారు. ఉదయం 8.41 గంటలకు కలశస్థాపనతో ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయ ప్రాంగణంలో గోపూజ నిర్వహించి, విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. ఉదయం 10.30 గంటల నుంచి స్వామి నిత్య కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం తిరిగి స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల తొలిరోజు సాయంత్రం మైలవరపు లక్ష్మీ నరసింహం ఆధ్యాత్మిక రామాయణం అనే అంశంపై ప్రవచనం చేశారు. నగరానికి చెందిన వీఎస్ వల్లీప్రియ భక్తి సంకీర్తనామృతం ఆకట్టుకుంది. వారాహిదేవి నృత్య నికేతన్ ఆధ్వర్యంలో జాహ్నవి లాలిత్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు భక్తులను అలరించాయి. శుక్రవారం సాయంత్రం ఆరు గంటల నుంచి ప్రముఖ ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు ప్రసంగం స్వామివారి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేశారు.

శ్రీవారి ఆశీస్సులు పొందాలి

వేంకటేశ్వరస్వామి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాలను ప్రజలందరూ తిలకించి స్వామివారి ఆశీస్సులు పొందాలని నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు అన్నారు. బ్రహ్మోత్సవాల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నూర్జహాన్ పెదబాబు ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు ఏలూరు నగరంతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా స్వామివారిని దర్శించుకోవాలని భక్తులకు సూచించారు. ఈ ధర్మకర్తల మండలి గత రెండేళ్లుగా భక్తిశ్రద్ధలతో స్వామివారి ఆలయాన్ని సుమారు కోటి రూపాయలకుపైగా విరాళాలు సేకరించి అభివృద్ధి చేయడం స్వామి వారి కృపతో మాత్రమే సాధ్యమయిందన్నారు. తొలుత ధర్మకర్తల మండలి చైర్మన్ తోలేటి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు, ఈఓ సన్యాసిరావు, అర్చకులు మేయర్ నూర్జహాన్ పెదబాబు దంపతులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాసరావు, కార్పొరేటర్ సబ్బన శ్రీనివాసరావు, కోఆప్షన్ సభ్యురాలు కొంపెల్ల తాయారు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	28	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	36	చిక్కుడు కాయలు	96
వంకాయలు (కాంతులు)	40	బీన్లచిక్కుడు	108
వంకాయలు (తెలుపు)	--	చామదుంపలు	50
బెండకాయలు	64	ములక్కాడలు	10-15
పచ్చిమిర్చి	36	కంద	54
కాకర కాయలు	64	బీట్‌రూట్	40
బీరకాయలు	54	కీర దోస	30
బీరకాయలు (పందిరి)	74	ఫ్రెంచ్‌బీన్స్	70
క్యాబేజీ	22	అల్లం	128
క్యారెట్	44-58	కొత్తిమీర (కట్ట)	18
దొండకాయలు	70	పాలకూర	12
బంగాళదుంపలు	26	చుక్కకూర	12
ఉల్లిపాయలు	33	తోటకూర	12
గోరుచిక్కుడు	64	గోంగూర	08
దోసకాయలు	34-44	పుదీనా	05
అనబకాయ (1)	30-40	క్యాప్సికమ్	84
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	35
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	36
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	44
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	17
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	26
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	32
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	29
ద్వారకాతిరుమల -ఏలూరు- బీహెచ్‌ఈఎల్	22.15	4822	29
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	37
ఏలూరు -తిరుపతి	16.00	4830	33

కోడిపందాలపై ముందస్తు చర్యలు తీసుకోవాలి

జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి


నిడమర్రు పీఎస్‌లో రికార్డుల తనిఖీ చేస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

నిడమర్రు: సంక్రాంతి పండుగ నేపథ్యంలో సంప్రదాయం పేరిట గ్రామాల్లో కోడిపందాలు, జూదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశించారు. గురువారం నిడమర్రు పోలీస్ స్టేషన్‌ను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలు మరో మూడు నెలల్లో నిర్వహించే అవకాశం ఉన్నందున సిబ్బంది తగిన విధంగా పోలింగ్ కేంద్రాల వివరాలు, సమస్య, అతి సమస్యాత్మక గ్రామాలపై దృష్టి పెట్టాలన్నారు. గ్రామాల్లోని మహిళా పోలీసుల సేవలు వినియోగించుకోవాలన్నారు. ఎస్పీ వెంట ఏడీఎస్పీ శ్రీనివాసరావు, నిడమర్రు సీఐ ఎంవీ సుభాష్, నిడమర్రు, గణపవరం, చేబ్రోలు ఎస్సైలు ఆర్.శ్రీను, వెంకటేశ్వరరావు, మణికుమార్ ఉన్నారు.

వ్యాయామ కళాశాల విద్యార్థుల ప్రతిభ

దెందులూరు : ఆదికవి నన్నయ యూనివర్సిటీ వాలీబాల్ పోటీల్లో గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. వర్సిటీ స్థాయిలో 5 జిల్లాల జట్ల మధ్య జరిగిన పోటీల్లో వ్యాయామ కళాశాల విద్యార్థులు ఆర్.సూర్య మణికంఠ, పి.సాయికిరణ్, ఎస్.భీమరాజు జిల్లాలో రెండో స్థానం సాధించారు. గురువారం కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నతానియేల్ విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు సౌత్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్ (ఎస్ఆర్ఎం)కు ఎంపిక కావటం సంతోషంగా ఉందన్నారు.

9 నుంచి సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రవి

ఏలూరు (టూటౌన్): సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు జనవరి 9 నుంచి మూడు రోజులపాటు ఏలూరులో తొలిసారిగా నిర్వహించనున్నట్టు ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి తెలిపారు. స్థానిక పవరుపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర కమిటీ సమావేశాల వివరాలను వెల్లడించారు. సమావేశాల్లో బీజేపీ, బీజేపీ మిత్ర పక్షాలను ఓడించడం, వామపక్ష శక్తుల ఐక్య, సీపీఎం స్వతంత్ర విధానం, రానున్న ఎన్నికల్లో సీపీఎం అనుసరించాల్సిన ఎత్తుగడలు తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. సమావేశాలకు సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, ఎంఏ బేబి, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యుడు గఫూర్, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొంటారని తెలిపారు. 9న నిర్వహించే జిల్లా సమగ్రాభివృద్ధి సదస్సుకు ఎమ్మెల్సీలు కె.లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర నాయకులు, జిల్లా ప్రముఖులు, మేధావులు పాల్గొని తమ అభిప్రాయాలు, సలహాలు అందజేస్తారని తెలిపారు. 10, 11 తేదీల్లో నిర్వహించే సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు నిర్వహిస్తామన్నారు. విలేకరుల సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.కిషోర్, ఏలూరు నగర కమిటీ సభ్యుడు వి.సాయిబాబు పాల్గొన్నారు.

వైభవంగా శాంతి కల్యాణం



భీమడోలు: గుండుగొలను సీతారామస్వామివారి ఆలయంలో గురువారం స్వామివార్లకు క్షీరాభిషేకం, ఉత్సవ మూర్తులకు శాంతి కల్యాణం వేడుకగా నిర్వహించారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండ గంగా రాజ్‌కుమార్ ఆధ్వర్యాన యాజ్ఞిక స్వామి దివి గోపాలాచార్యులు, ఆలయ పూజారి సాయి సుధీరాచార్యులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. శ్రీరామ జపం చేస్తూ విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా అయోధ్య శ్రీరామ ప్రతిష్ఠ అక్షితల కలశాలను భక్తులకు ప్రసాదించేందుకు గానూ ఆలయంలోని స్వామివారి ఎదుట ఉంచి పూజలు చేశారు. అనంతరం స్వామివారి శాంతి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

రెండో విడత యాత్రను విజయవంతం చేయాలి

దెందులూరు: వచ్చేనెల 3వ తేదీ నుంచి ఏలూరు రూరల్ మండలంలో జరిగే ప్రజా ఆశీర్వాద యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కోరారు. గురువారం ఏలూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఏలూరు రూరల్ మండల నాయకులు, కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో ప్రజలకు జరిగిన మంచిని గుర్తు చేస్తూ, అలాగే వారి సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా ప్రజా ఆశీర్వాద యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే ప్రజలందరి ఆశీస్సులతో మొదటి విడత ప్రజా ఆశీర్వాద యాత్ర విజయవంతంగా పూర్తయిందని అన్నారు. సమావేశంలో వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ముంగర సంజీవ్ కుమార్, దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, ఏలూరు ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, పార్టీ ఏలూరు మండలాధ్యక్షుడు తేరా ఆనంద్, జెడ్పీటీసీ మండల సరస్వతి కొండలరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీల అమలు ఘనత సీఎం జగన్‌దే

ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: కరోనా విపత్తు వచ్చినప్పటికీ రాష్ట్రంలో ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందించి ఎన్నిక హామీలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. గురువారం దెందులూరు మండలం గోపన్నపాలెం పంచాయతీ పరిధిలోని వేగవరం గ్రామంలో రూ.24 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం, రూ.46 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాలను సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరమ్మ కుమార్ బాబు, అంజలి ప్రసాద్, సువ్వా ప్రభుదాస్, మండలాధ్యక్షుడు కామిరెడ్డి నానితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, వైస్ చైర్మన్ కాటి సుధాకర్, పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నాకుమారి, మంగంటి కృష్ణమోహన్, మోర్ల సుబ్బారావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కొండేటి గంగాధర్ బాబు, జెడ్పీటీసీ నవకాంతం, ఎంపీడీఓ భీమేశ్వరరావు, తహసీల్దార్ నాంచారయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు ఏనుగు హేమాసాగర్, కొండేటి బాబు, తోట పద్మారావు, మాజీ సర్పంచ్ కొండేటి హనుమంతు తదితరులు పాల్గొన్నారు.